
# గొలుసు ప్రక్రియ

శనివారం సెలవు రోజైనా శని తప్ప లేదనుకొంటూ విభాగాధిపతులూ, వారి సహాయకులూ సమావేశమందిరంలో తమ తమ ఆసనాల్లో కూర్చున్నారు. సరిగా పదింటికల్లా రీజియనల్ డైరెక్టర్ పంకజ్ చరణ్ మిశ్రా ప్రవేశించడంతో అందరూ ఓసారి లేచి కూర్చున్నారు. పంకజ్ చరణ్ మిశ్రా తన ముందునున్న ఎజెండాని ఒక్క నిముషం




చూసి పక్కన పెట్టేశాడు. అందర్నీ సామూహికంగా విష్ చేసి తన నున్నటి గుండు మీద ఎడంచేత్తో ఓసారి తడుముకొన్నాడు. పంకజ్ చరణ్ మిశ్రా తల్లి కాలధర్మం చెందడంతో యిరవై రోజులు శలవు పెట్టి లక్నో వెళ్ళి, క్రితం రోజు రాత్రి తిరిగి వచ్చాడు. తల్లి పోయిన దుఃఖంలో సమావేశం కాస్త సరళంగా జరిగిపోతుందనుకొన్నారందరూ.

"గత రెండు వారాల్లోనూ ఉత్పత్తి యిరవై శాతం పడిపోయింది! యిదే పంథాలో నడిస్తే వార్షిక లక్ష్యాలని సాధించలేం. బోనస్‌ల్లు రావు. రాలేదని యూనియన్లూ, వారితో బాటు మీరూ గొడవ పెడతారు" జనాంతికంగా అన్నాడు.

ఎవరూ సమాధానం చెప్పలేదు.

"అందరూ మౌనంగా కూర్చుంటే ఎలా? మీరేమంటారు నవనీత్ షా?"

నవనీత్ షా జనరల్ మేనేజర్. ఉత్పత్తుల బాధ్యత ముఖ్యంగా అతనిదే. షా కాస్త తగ్గు స్వరంలో అన్నాడు.

"ఆరో నెంబరు ప్లాంట్‌లో వర్కర్సు వర్క్ టు రూల్ అని మొరాయించారు!"

"వారు నోటీసు యిచ్చి మొదలుపెట్టారా లేక యివ్వకుండా మొదలు పెట్టారా?" –

మిశ్రా యధాలాపంగా అడిగాడు.
"మీకు తెలియందేముంది సాబ్! సమ్మెకైతే నోటీసిస్తారుకాని, నియమాల ప్రకారమే పనిచేస్తాం అనడం న్యాయసమ్మతమే కాబట్టి లిఖితపూర్వకంగా ఎవరూ యివ్వనవసరం లేదు!" – డి.జి.ఎమ్.(అడ్మినిస్ట్రేషన్) దేశాయ్ అన్నాడు, పంకజ్ చరణ్ మిశ్రాకు గుర్తు చేస్తూ.
"యిలా జరుగుతోందని నాకెందుకు తెలియజెయ్యలేదు?" మిశ్రా ప్రశ్నించాడు.
"మీరు సెలవు మీదనున్నారాయె. అందులోనూ దుఃఖ వాతావరణంలో ఉన్న మిమ్మిల్ని యిబ్బంది పెట్టడం యిష్టంలేకపోయింది" అన్నాడు షా. షా సహాయకుడు మనోజ్ 'ఎంత చక్కటి అబద్ధం?' అనుకొన్నాడు. ఎందుకంటే షా లక్నోలో ఉన్న మిశ్రాకి జరుగుతోన్నది ఫోన్లో చెప్పడానికి మూడుసార్లు ప్రయత్నించాడు. ఆ సమయాల్లో మిశ్రా యింట్లో లేక పోవడం జరగడంతో షా నోరు మూసుక్కూర్చున్నాడు కాని, అహ్మదాబాద్ నుంచి తను ఫోన్ చేసినట్లుగా చెప్పమని చెప్పలేదు.
"యింతకీ వారిక్కావల్సింది ఏమిటి? మీరు చేసిందేమిటి?"
"సేఫ్టీ షూస్ (నిరుప ద్రవ పాదరక్షలు) మంచి రకానివి కాకుండా నాసిరకానివి యిచ్చారనీ, యూనిఫాం క్లాత్ (దండు ఉడుపుల గుడ్డ) కూడా ఏవో చెత్త మిల్స్‌వి యిచ్చారనీ గొడవ లేవదీశారు."
"సోనీ సాబ్, మీరేమంటారు?" మిశ్రా జనరల్ మేనేజర్ (స్టోర్స్ అండ్ పర్చేజ్) వైపు చూస్తూ అన్నాడు.
"ఈ రెండు వస్తువుల కొనుగోలు విషయమై మన కేంద్ర స్థావరమే అన్నీ నిర్ణయించింది. స్పెసిఫికేషన్స్ (వస్తు వివరణలు) వాళ్ళు యిచ్చినవే. టెండర్లు పిలిచి దేశంలో ఉన్న మన సంస్థలకన్నింటికీ కలిపి వాళ్ళే ఆర్డరిచ్చారు. మనం చేసిందల్లా మనకెంత సరుకు అవసరమో చెప్పి, దానికి తగ్గ శాంక్షన్ పంపడమే" అన్నాడు సోనీ.
"కాని సరుకుని పరీక్షించిందెవరు?మనమే అయ్యుంటాం?"
"మీరన్నది నిజమే. ఎవరి ప్రాజెక్ట్ నుంచి వాళ్ళు యినెస్పెక్షన్ టీమ్స్‌ని పంపించి సప్లై కంపెనీల ప్రాంగణంలో వాళ్ళు తయారు చేసిన సరుకు నాణ్యతను పరీక్షించుకోమన్నారు. నా విభాగం నుంచి యిద్దరూ, ఉత్పత్తి విభాగం నుంచి యిద్దరూ – ఆఫీసర్లు వెళ్ళి పరీక్షించారు. రెండు వేల జతల సేఫ్టీ షూస్‌ని పరీక్షించి నూట యాభై జతల్ని తృణీకరించి, మిగిలినవాటిని పాస్ చేశారు. క్లాత్ విషయంలో కూడా అదే జరిగింది" అన్నాడు సోనీ వివరాలు చెపుతూ.
"మెకానికల్ యింజనీర్లనీ, కెమికల్ యింజనీర్లనీ చెప్పుల నాణ్యత నిర్ణయిమచమని పంపితే వ్యవహారాలిలానే ఉంటాయి. నిగనిగలాడే బూట్లు తొడుక్కొని నడుస్తే మడమలు

ఊడిపోతున్నాయని వాళ్ళ ఫిర్యాదు" అన్నాడు షా.

"ఔద్యోగికసురక్షా విధానాలలో నిరుప ద్రవ పాదరక్షలు, శిరో రక్షణ కవచాలు చెప్పుకోదగ్గ పాత్ర వహిస్తాయి. కాబట్టి, వాటి విషయమై తగు శ్రద్ధ తీసుకోకపోతే చెప్పు దెబ్బలే తగుల్తాయి! కాస్త ధరలెక్కువైనప్పటికీ మంచి కంపెనీల సరుకు కొని ఉండాల్సింది" అన్నాడు రసాయనక విభాగాధిపతి శాస్త్రి. పుల్ల విరుపు మాటలనందే శాస్త్రికి సమావేశాల్లో పాల్గొన్న ఆనందం రాదు.

"నేను కూడా ఫైల్లో అదే కామెంట్ వ్రాసినట్లు గుర్తు" అన్నాడు ఆర్.డి. మిశ్రా. సోనీకి శాస్త్రి మీద ఒళ్ళు మండింది. కాని మిశ్రా కూడా అదే మాటన్నాడు. సోనీ లౌక్యంగా అన్నాడు.

"కొన్ని విషయాల్లో నాణ్యతని, సరఫరా చేసే కంపెనీల ప్రమాణాల్ని దృష్టిలో ఉంచుకొని పది శాతం అధిక ధరల వరకూ ఛైర్మన్‌కి నిర్ణయం తీసుకొనే అధికారం ఉంది. కాని ఈ విషయంలో మట్టుకు తేడా పదిహేను శాతానికి మించి ఉంది. అయినా మన సంస్థ యిచ్చిన వస్తు వివరణ ప్రకారము వాళ్ళు టెండర్లు యివ్వడం మూలాన, తక్కువ ధర పలికిన వాడికి ఆర్డరు వెయ్యకతప్పలేదు. గుడ్డ విషయంలోనూ అదే జరిగింది."

"మెకానికల్ యింజనీర్సే కాకుండా మన సంస్థ కొనుగోలు విభాగంలో కొందరు చర్మ, వస్త్ర సాంకేతిక నిపుణుల్ని కూడా ఉద్యోగంలోకి తీసుకోవాలి!" అన్నాడు శాస్త్రి.

"ముంబయ్ మహదేవా కెమికల్స్ వాళ్ళు సప్లై చేసిన రసాయన పదార్థాలని పరీక్షించి పాస్ చేసింది మీ కెమిస్ట్రీ సెక్షన్ ఆఫీసర్లే! ఏమైంది? మూతి కాలింది!" – సోనీ తిరుగు జవాబిచ్చాడు.

మిశ్రా ఓ చిరునవ్వు నవ్వాడు. దాంతో చిరునవ్వుల జల్లులు కురిసాయి.

"బుట్టల్లో పై వరుస మంచి పళ్ళని ఉంచి కింద వరుసల్లో పాడైన పళ్ళని పెట్టి అమ్మినట్టే, ఆ కంపెనీ వాళ్ళు ఏభై కేజీల డబ్బాల్లో పై రెండు కిలోలూ మంచి సరుకుంచి మోసం చేశారు. అందులో నా వాళ్ళ తప్పు లేకపోయినా, యిద్దరి ఆఫీసర్ల యింక్రిమెంట్లు ఆగిపోయాయి. ఆ కంపెనీని బ్లాక్‌లిస్ట్ చెయ్యమని రికమెండ్ చేసినా, మీ కొనుగోలు విభాగం యింతవరకూ ఆ విషయమై ఏ చర్యా తీసుకోలేదు! నేను జోళ్ళ పరీక్ష విషయమై అన్న మాటలు ఎగతాళిగా అనలేదు. సీరియస్‌గానే అన్నాను. మన సంస్థకి చర్మ, వస్త్ర నిపుణుల అవసరం ఉంది!" అన్నాడు శాస్త్రి.

"మనందరికీ మెదళ్ళూ, చర్మాలూ ఏనాడో మొద్దుబారిపోయాయి! ఉన్న నిపుణులు చాలు రోకటి పోట్లకి!ఏమిటీ, ఆ మూల మీరిద్దరూ గుసగుసలాడుకొంటున్నారు? గట్టిగా చెబితే విని మేమూ సంతోషిస్తాం!" అన్నాడు మిశ్రా, వాళ్ళ వాళ్ళ బాస్‌ల వెనకాల కుర్చీల్లో కూర్చున్న యిద్దరి వైపు చూస్తూ.

వాళ్ళు షా సహాయకుడు మనోజ్, శాస్త్రి సహాయకుడు పటేల్.

"కేంద్ర స్థావరం మీద ఓ మంత్రిగారి ద్వారా రాజకీయపరమైన ఒత్తిడి వచ్చిందిట. అందుకని కాన్పూర్‌లో ఉన్న ఓ చర్మ వస్తు తయారీ సహకార సంఘానికి సేఫ్టీ షూస్ తయారీకి నియామకం జరిగిందట. పాలకవర్గానికి సంబంధించిన వాడైనా, మన ఆరో నెంబర్ ప్లాంట్ ఉన్న గ్రామం అసెంబ్లీ నియోజకవర్గ సభ్యుడు వేరే ముఠాకి చెందినవాడు కావడం వల్లా, మన ఆ ప్లాంట్ వర్కర్ల యూనియన్ మీద ఈయన ప్రభావం అధికంగా ఉండడం మూలాన, ఆరో నెంబరు ప్లాంట్ వర్కర్లని రెచ్చగొట్టాడు" అన్నాడు పటేల్.

"చర్మకారుల సహకార సంఘాలకి ఆర్డరిచ్చినంత మేరకు తప్పు పట్టడానికి వీల్లేదు. పెద్ద కంపెనీల వాళ్ళు కూడా వీరి చేతే చేయించి, తమ బ్రాండ్ నేమ్‌తో అధిక ధరలకు అమ్మడం సాధారణమే. అయితే వాళ్ళు నాణ్యత విషయంలో రాజీ పడరు. అయితే మనం ఈ సహకార సంఘాల నుంచి డైరెక్టుగా కొనుగోలు చేస్తే, శాస్త్రిగారు చెప్పినట్టుగా వాటి నాణ్యత నిర్ధారించే అనుభవం మనకి ఉండదు, వాడిన తర్వాత గోడు పెట్టడం తప్ప! ఈ సహకార సంఘాలు కూడా ప్రభుత్వ సంస్థల్ని లోకువ కట్టేస్తాయి! అయితే ఈ సమస్యకి పరిష్కారం?" – చిన్న భాషణ యిచ్చి చివరగా ప్రశ్నించాడు మిశ్రా.

"ఆ ఎమ్.ఎల్.ఏ. గారిని బుజ్జగించే ప్రయత్నం చెయ్యాలి" అన్నాడు డి.జి.ఎమ్. దేశాయ్. దేశాయ్ పాలనా వ్యవహారాలు చూస్తాడు.

"మెహతాజీ మీరేమంటారు?" అన్నాడు మిశ్రా ప్రజాసంబంధాల శాఖాధిపతిని ఉద్దేశిస్తూ.

"మన ఆరో నెంబరు ప్లాంట్ కాంటీన్ కాంట్రాక్టు ఆయన గారి మనుషుల కివ్వలేదని ఆయనకి చాలా గుర్రుగా ఉంది. వాళ్ళు గ్రామంలోని హైస్కూలుకి కొత్త బిల్డింగ్ మనల్ని కట్టించమంటున్నాడు" అన్నాడు మెహతా.

"గ్రామం పక్కగా ప్లాంట్‌కి వెళ్ళే రోడ్లు మనం బాగు చేయబోతుంటే రాజకీయంగా అడ్డుపడి, మన చేత పంచాయితీకి గ్రాంటిప్పించి చాలామట్టుకు స్వాహా చేశాడు. ఆ ప్రయత్నంలో మన సంస్థ మీదా, ప్రత్యేకించి సివిల్ సెక్షన్ మీదా చాలా బురద జల్లాడు" అన్నాడు ఛీఫ్ యింజనీర్ (సివిల్).

"యింతకీ యిక్కడ కూర్చుని యిన్ని కబుర్లు చెబ్తూ కూర్చోవడమేకాని, వర్కర్లు చేసే ఫిర్యాదుల్లో నిజానిజాలు కనుక్కొనే ప్రయత్నం జరిగిందా? మీరిద్దరూ ప్లాంట్‌కి వెళ్ళి వాస్తవాలు కనుక్కొన్నారా?" మిశ్రా షానీ, సోనీని ప్రశ్నించాడు.

యిద్దరూ ముఖాముఖాలు చూసుకొన్నారు కాని నోరు విప్పలేదు.

"సరే రేపు ఉదయమే నేను ఆరో నెంబరు ప్లాంట్‌కి వెళ్ళి అక్కడి వర్కర్లతో మాట్లాడతాను. మీ జి.ఎమ్.లందరూ, పి.ఆర్.ఓ., డిజిఎమ్ ఎడ్మినిస్ట్రేషన్ అందరూ ప్లాంట్‌లో

ఎనిమిదింటికల్లా ఉండాలి!" అన్నాడు మిశ్రా.

ఆదివారం కూడా గోవిందా!' అనుకొన్నారందరూ మనసులో. సమావేశం అంతటితో ముగిసిపోతుందేమోనని ఆశపడ్డ కొందరికి ఆశాభంగం కలిగిస్తూ షా మరో విషయం మిశ్రా దృష్టికి తీసుకువచ్చాడు.

"మన ప్రాజెక్టులోని అన్ని ప్లాంట్లకీ మంచినీళ్ల సరఫరా సరిగా జరగటం లేదని వర్కర్సూ, ఆఫీసర్సూ కూడా గోల పెడ్తున్నారు. యిదీ పనిలో కొంత జాప్యం కలిగిస్తోంది" అన్నాడు షా. ఉత్పత్తి తగ్గడానికి కారణాలనేకం అని చెప్పడమే ఎప్పుడూ అతని ధ్యేయం.

"రంగరాజన్‌జీ! మంచి నీళ్ల టాంకర్ సమయానికి వెళ్ళటల్లేదా?" మిశ్రా డి.జి.ఎమ్. (ట్రాన్స్‌పోర్ట్) అంటే రవాణా శాఖాధికారిని ప్రశ్నించాడు మిశ్రా.

"అయిదో నెంబరు ప్లాంట్‌కి షిఫ్టు జనాల్ని తీసుకువెళ్ళే బస్సు డ్రైవరూ, కండక్టరూ పబ్లిక్ పాసింజర్స్‌ని ఎక్కించుకోవడం వల్ల, మన ఆఫీసర్లూ, వర్కర్లూ చాలా సమయాల్లో నిలబడి వెళ్ళవలసి వస్తోందని కంప్లైంట్లు వచ్చాయి. నీళ్ళ టాంకర్ డ్రైవర్నీ, క్లీనర్నీ ఆ బస్సుకి మార్చి, ఆ బస్ డ్రైవర్ని నీళ్ళ టాంకర్‌కి మార్చి, కండక్టర్‌ని కంట్రోల్ రూంలో వేశాను. ఆ బస్ డ్రైవర్ నీళ్ళ టాంకర్లో ప్రతి రోజూ ఏదో లోపం చూపించి దాన్ని సరిగా నడపటల్లేదు. ఆ విషయమై డ్రైవర్‌కి మెమో యిస్తే దాన్ని తిరిగి తీసుకోవాలని నాలుగు రోజులు క్రితం మెరుపు వేగంతో ఓ సమ్మె చేశారు. ఆ డ్రైవర్ని రెండో నెంబరు ప్లాంట్‌కి షిఫ్ట్ బస్‌కి మార్చి, పాత నీళ్ళ టాంకర్ డ్రైవర్ని అయిదో నెంబర్ ప్లాంట్ షిఫ్ట్ బస్ నుంచి తిరిగి రప్పించి, రెండో నెంబరు ప్లాంట్ షిఫ్ట్ బస్ డ్రైవర్ని.." రంగరాజన్ వాగ్ధాటిని మిశ్రా అడ్డుకొన్నాడు.

"..... అయిదో నెంబరు ప్లాంట్ షిఫ్ట్ బస్‌కి వేశానంటారు. బదిలీల పర్వం మాట దేముడెరుగు కాని ప్రస్తుతం మంచినీళ్ల సరఫరా సవ్యంగా జరుగుతోందా లేదా చెప్పండి" అన్నాడు మిశ్రా.

"బస్ డ్రైవర్ రివర్స్ చేస్తూ నీళ్ళ టాంకర్ని ఓ చెట్టుకు గుద్దించాడు. వాటర్ అవుట్‌లెట్ దెబ్బతింది. ప్రస్తుతం నీళ్ళ టాంకర్ వర్క్‌షాపులో ఉంది. ఈ సాయంకాలానికల్లా బాగుపడ్తుంది."

"బాగుచెయ్యడంలో ఆలస్యం ఎందుకు జరిగినట్టు?" మిశ్రా వర్క్ షాప్ బాస్ ఖత్రీ వైపు చూశాడు.

"వెల్డింగ్ రాడ్‌ల కోసం స్టోర్స్ వాళ్ళకి చెప్పి పది రోజులైంది. ఈ ఉదయమే నా జేబులోంచి రెండు వందలు తీసియిచ్చి కొనుక్కురమ్మని ఫోర్‌మన్‌ని పంపాను. సాయంత్రానికల్లా టాంకర్ సిద్ధమవుతుంది" అన్నాడు ఖత్రీ.

"జేబులోంచి ఖర్చు పెట్టడమెందుకు? యింప్రెస్ట్ మనీ ఉందిగా?" అన్నాడు మిశ్రా.

(చిన్న అవసరాల నిమిత్తం తక్షణ కర్తవ్యంగా ఖర్చు పెట్టే సొమ్ము).

"వాటి తాలూకు బిల్స్ సబ్‌మిట్ చేసి పది రోజులైంది. యింతవరకూ రీయింబర్స్ కాలేదు!"

"ఎక్స్‌లెంట్! నీళ్ళ టాంకర్ కొని ఎన్నేళ్ళయింది?"

"అయిదేళ్ళు దాటింది" అన్నాడు రంగరాజన్.

"ఆ బండిని మూలపడవేసి, మంచినీళ్ళ సరఫరా ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టర్లకి కాంట్రాక్ట్ యివ్వండి. ఈ గొడవలేమీ ఉండవు."

"ఈ ఏడు బడ్జెట్ సరిపోదు. అయినా ఈ విషయమై ముందస్తుగా బడ్జెట్ ప్రతిపాదనల్లో చర్చించలేదు. హెడ్ క్వార్టర్స్ అనుమతి కావాలి" అన్నాడు జి.ఎమ్. (ఫైనాన్స్) ధనరాజ్ గుప్తా.

"చూడండి ధనరాజ్ గుప్తా! అక్కడ ఫీల్డ్ విషయాల ఆకళింపులేక కామెంట్స్ చేస్తే సరిపోదు. ఆటో, ట్రాన్స్‌పోర్ట్ సెక్షన్ సహాయంతో యివ్వాళ రేపట్లో ఖర్చుల అంచనాలు వేస్తూ ప్రపోజల్సు పెట్టి, నా చేత సంతకం చేయించుకొని, ఎల్లుండి సోమవారం మీరే స్వయంగా ఢిల్లీ వెళ్ళి శాంక్షన్ తీసుకురండి"

"అది కాదు సాబ్, మెంబరు ఫైనాన్స్..."

"...అభ్యంతరం తెలిపితే నేను ఛైర్మన్‌తో మాట్లాడతాను, సరేనా?" అన్నాడు మిశ్రా నవ్వుతూ.

ధన్‌రాజ్ గుప్తా మరి మాట్లాడలేదు.

"సాబ్! మూడో నెంబరు ప్లాంట్‌లో సెపరేటర్ యూనిట్ సరిగా పనిచెయ్యటల్లేదు. దాని మూలాన కూడా..." షా అర్ధాంతరంగా ఆపివేశాడు.

"... ఉత్పత్తులు తగ్గాయంటారు. యింత చిన్న విషయాలు కూడా ఈ మీటింగ్ వరకూ రావాలా?' మిశ్రా కుర్రవాణ్ణి మందలించినట్టుగా అన్నాడు.

"తీసుకురాకూడదనుకొన్నాను కాని సాధ్యం కాలేదు. సెంట్రల్ వర్క్‌షాప్ వాళ్ళు దాన్ని సరిగా బాగు చెయ్యలేకపోతున్నారు!" అన్నాడు షా.

మిశ్రా సెంట్రల్ వర్క్‌షాప్ జి.ఎమ్. నారాయణరావు వైపు చూస్తూ అడిగాడు – "షా గారి మాటకి మీ సమాధానమేమిటి?"

"ఆ యూనిట్‌ని అమెరికా నుంచి కొన్నప్పుడు ట్రైనింగ్ కని ఫీల్డ్ ఆపరేషన్ యింజనీర్స్‌ని పంపించారే కాని, వర్క్‌షాప్ యింజనీర్స్‌ని ఒక్కర్నీ పంపలేదు. ఆ యూనిట్‌లో ఏ భాగాన్ని విప్పాలన్నా మా వాళ్ళు తటపటాయిస్తున్నారు!" అన్నాడు నారాయణరావు.

"స్టాండ్ బై యూనిట్ కాని, సబ్ ఎసెంబ్లీస్ కాని కొనలేదా?"

"బడ్జెట్ లేక కొనలేకపోయాం" అని షా సమాధానమిచ్చాడు.

"స్టాండ్ బై యూనిట్ కోసం, వర్క్‌షాపులో యిద్దరి మెకానికల్ యింజనీర్సుకి అమెరికా ట్రెనింగ్ కోసం ప్రపోజల్ పెట్టి, నా సంతకం చేయించి ఆ ఫైల్ కూడా జి.ఎమ్. ధనరాజ్ గుప్తాగారి కివ్వండి. ఛైర్మన్ అనుమతి ఆయన తీసుకువస్తాడు."

ధనరాజ్ గుప్తా ఏదో అనబోయి నోరు మూసుక్కూర్చున్నాడు. తన ఆఫీసర్ల అసంతృప్తిని అవకాశం దొరగ్గానే తెలియజేసి ఫలితం సాధించినా, అది వర్క్‌షాప్ అధినేతగా తన అసమర్థతకి ఓ ఋజువుగా తీసుకొంటారేమోనని రాబోయే ప్రమోషన్లని మనసులో తలచుకొంటూ ఒక్క క్షణం యిబ్బంది పడ్డాడు నారాయణరావు.

షా యింకా ఏదో చెప్పబోతుంటే మిశ్రా వారించాడు.

"ఈ రోజుకీ తలనొప్పి చాలు. ముందా ప్రపోజల్స్ సంగతి చూడండి. రేపు ఉదయం ఆరో నెంబరు ప్లాంట్ దగ్గరకి రావడం మరువకండి. థాంక్యూ ఫర్ యువర్ సాటర్‌డే!" అని కూర్చీలోంచి లేచాడు.

ఆదివారం మార్నింగ్ షిఫ్ట్ ఇన్‌ఛార్జి ఉదయ్‌కుమార్ ఆరో నెంబరు ప్లాంట్‌ని చుట్టి తిరిగి వస్తోంటే, ఏడింటికి కారులోంచి దిగుతోన్న ఆర్.డి. మిశ్రా కనపడ్డాడు. గుండుతో ఉన్న ఆయన్ని ముందుగా ఆనవాలు కట్టలేకపోయిన ఉదయ్‌కుమార్ ఆయన్ని గుర్తించగానే తడబడుతూ నమస్కారం చేసి, ఆయన ప్రశ్నలడుగుతూండగా వెంట నడుస్తూ మరోసారి ప్లాంట్ ప్రదక్షిణ చేశాడు. యిద్దరూ పోయి ప్లాంట్ ఆఫీసులో కూర్చున్నారు. ఉదయ్‌కుమార్ చెప్పిన కథనం ప్రకారం అంతకు రెండు వారాల క్రితం ఓ టెక్నీషియన్ హవాయి చెప్పులు వేసుకొని డ్యూటీకి వచ్చాడు. ఓ బరువైన బోల్టు కాలి మీద పడి బొటన వేలు చితికింది. అతనికి చికిత్సా అది చేయించి, ఆ తర్వాత సేఫ్టీ షూస్ వేసుకోకుండా డ్యూటీకి వచ్చినందుకు ఉదయ్‌కుమార్ మెమో యిచ్చాడు గట్టిగా మందలిస్తూ. ఆ టెక్నీషియన్ యూనియన్ నేతతో మొరపెట్టుకున్నాడు. కొందరు వర్కర్లు యిచ్చిన షూస్ నాసిరకం అంటూ, జోళ్ళు కొరుకుతున్నాయనీ, బరువులు పడ్డప్పుడు పాదాలకు కముకు దెబ్బలు తగుల్తున్నాయనీ ఫిర్యాదులు తీసుకురాసాగారు. ఆ నియోజకవర్గం రాజకీయ నాయకుడు తెరవెనుక నుండి భాగోతం ఆడించడం మొదలు పెట్టాడు - అటు కేంద్ర మంత్రికీ, యిటు సంస్థకీ తన బలమేమిటో తెలియజెయ్యడానికి.

"ఈ సంగతి నువ్వు షాకి చెప్పావా?" మిశ్రా అడిగాడు.

"చెప్పాను సార్. ఆ టెక్నీషియన్‌కి మెమో యివ్వకుండా ఉండాల్సిందని నన్నే తిరిగి మందలించాడు. మీరు గమనించే ఉంటారు. షిఫ్ట్‌లో సగానికి పై మంది సేఫ్టీ షూస్ సంగతి మాట అటుంచి కనీసం మామూలు షూసైనా వేసుకోకుండా ఆకు చెప్పుల్తో వస్తున్నారు. సేఫ్టీ షూస్ వేసుకొని వచ్చేవాళ్ళు కేవలం పది శాతం ఉంటే, యూనిఫాం వేసుకొని వచ్చేవాళ్ళ సంఖ్య ఓ ముప్పై శాతం ఉండొచ్చు. హెల్మెట్లు ఓ యాభై శాతం

వాడ్తారు, ఎంతైనా తల తలే కదా!"

"యింటి దగ్గర టీ తాగకుండా బయలుదేరాను. పద, కేంటీన్‌కి పోయి టీ తాగి వద్దాం" అన్నాడు మిశ్రా.

"అక్కడికెందుకు సాబ్? నేను యిక్కడికే తెప్పిస్తాను" అన్నాడు ఉదయ్‌కుమార్.

"ఫర్వాలేదు. అందరూ రాగానే అక్కడే మీటింగ్ పెడ్తాను" అన్నాడు మిశ్రా కుర్చీలోంచి లేస్తూ.

యిద్దరూ ప్లాంట్ కేంటీన్‌కి వెళ్ళారు. అక్కడో పాతిక మంది దాకా టీ, కాఫీలు సేవిస్తున్నారు. కొంతమంది పూరీ, డోక్లా టిఫిన్లు తింటున్నారు. షిఫ్ట్ ఇన్‌ఛార్జినీ, ఆర్.డి.ని గుర్తుపట్టి అందరూ కుర్చీల్లోంచి లేచి నిల్చున్నారు. వాళ్ళని కూర్చోమని సైగ చేసి యిద్దరూ రెండు కుర్చీల్లో కూర్చున్నారు. కేంటీన్ మేనేజరు పరుగెత్తుకొంటూ వచ్చాడు. మిశ్రా రెండు టీలు పట్టుకు రమ్మని చెప్పి, "కేంటీన్ బూజులు దులిపి ఎన్ని రోజులైంది?" అని ప్రశ్నించాడు.

కేంటీన్ మేనేజర్ బిక్కచచ్చిపోయాడు – "మీరు వస్తున్నారని తెలుసుంటే..." అని మాట నసిగేశాడు.

"నా కోసం కేంటీన్ బూజులు దులిపించనఖ్ఖర్లేదు ప్రత్యేకంగా. యిక్కడ ఉద్యోగులు ఒక ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో ఓ కప్పు టీ తాగి వెళ్ళేటట్టు ఉండాలి. కేంటీన్ మెయిన్‌టెనెన్స్‌కి చాలా శాంక్షన్లే యిస్తున్నానే. ప్రారంభంలో ఉన్న ఆ వైభవమంతా ఏమైపోయింది?"

"సార్, బాగులు చేయించి, రంగులు వేయించి, కొత్త వంట పాత్రలు కొని, కొత్త క్రోకరీ కొనాలనియిప్పటికి రెండుసార్లు నేను ప్రపోజల్స్ పెట్టాను. అవి ఉదయ్‌కుమార్ సాబ్ ఎడ్మినిస్ట్రేషన్‌కి పంపించి ఆర్నెల్లకు పైగా దాటింది. యింతవరకూ అవి వెలుగును చూడలేదు. కంట్రాక్టు ప్రకారమూ యివన్నీ మీ సంస్థే చేయించాలి సాబ్!" అన్నాడు కేంటీన్ మేనేజర్ చేతులు నలుపుకుంటూ.

"సర్లెండి ఆ సంగతి నా దృష్టికొచ్చింది కాబట్టి చూస్తాను కాని, స్పెషల్ అని చెప్పకుండా అందరూ తాగే టీలనే పంపించండి" అన్నాడు మిశ్రా.

ఉదయ్‌కుమార్ తన జేబులోంచి కూపన్ బుక్ తీసి, రెండు కూపన్లు చింపి కేంటీన్ మేనేజర్ కిచ్చాడు. మేనేజర్ అక్కణ్ణుంచే రెండు టీ అని ఒక చిన్న అరుపు అరిచాడు. టీ వచ్చిన తర్వాత మిశ్రా టీ తాగాడు.

"ఫర్వాలేదు, బాగానే ఉంది" అన్నాడు కాస్త మెచ్చుకోలుగా.

కేంటీన్ మేనేజర్ నెమ్మదిగా, హాయిగా ఊపిరి పీల్చి, వదిలాడు.

ఎనిమిదిన్నరకి ప్లాంట్ చేరుకొన్న మిగిలిన అధికారులందరూ మెయిన్ గేట్ సెక్యూరిటీ

గార్డ్ ద్వారా ఆర్.డి. ఏడింటికే వచ్చాడన్న కబురు తెలుసుకొని యిబ్బందిగా కేంటీన్ హాల్లో ప్రవేశించారు. అప్పటికే ఆర్.డి. ఆదేశం ప్రకారం ఉదయ్‌కుమార్ కొంత మంది ప్లాంట్ వర్కర్స్‌ని రప్పించాడు.

మిశ్రా వేరే ఉపోద్ఘాతం లేకుండా అందర్నీ ఉద్దేశించి అన్నాడు.

"మీరేదో సేఫ్టీ షూస్ బాగాలేవనీ, యూనిఫాం క్లాత్ అధ్వాన్నంగా ఉందనీ 'నియమాల ప్రకారం పని' అనే పిరికి వాళ్ళ మార్గాన్ని ఎన్నుకొన్నారని విన్నాను. యింతకంటే దమ్ములతో చేసే సమ్మెలు మేలు! యిప్పుడు మీలో ఎంతమంది సేఫ్టీ షూస్ ధరించారో, ఎంతమంది యూనిఫాం ధరించారో చెప్పకనే తెలుస్తోంది. సగానికిపైమందిని ఈ క్షణంలో కావాలంటే క్రమశిక్షణా రాహిత్యానికి శిక్షించగల అధికారం నాకుంది. అయితే మిగిలిన పది ప్లాంట్లలోనూ లేని అసంతృప్తి ఈ ప్లాంట్‌లోనే ఎందుకొచ్చిందో నాకు తెలియదు. ఏమో, మీకు వచ్చిన బాచ్ నాసిరకంగా కావచ్చునన్న యిదితో ఓ మార్గం సూచిస్తాను. మీకిచ్చిన షూస్‌నీ, యూనిఫాం క్లాత్‌నీ తిరిగి వాపసు చేసి, ఓ ఆథరైజేషన్ స్లిప్ తీసుకోండి. మీ కిష్టం వచ్చిన షూ కంపెనీకి కాని, బట్టల షాపుకు కాని వెళ్ళి సంస్థ నిర్ధారించిన రేట్లకి పది శాతం ఎక్కువ కాకుండా, కొనుక్కోండి. దుస్తుల రంగులు కంపెనీ నిర్ధారించిన నాలుగు రంగుల్లోనూ ఒకటై ఉండాలి. తర్వాత ఆ ఆథరైజేషన్ స్లిప్‌నీ, బిల్లునీ సబ్‌మిట్ చేసి డబ్బులు తీసుకోండి. పదిహేను రోజుల్లో ఏ ఒక్కరు యూనిఫాంలో రాకపోయినా సస్పెండ్ చెయ్యమని ఆదేశాలూ, అధికారమూ యిప్పుడే నోటి మాటగా ప్లాంట్ యిన్‌ఛార్జి కిస్తున్నాను. సరే ఏ ఒక్కరైనా ముందుకు వచ్చి మీరు తొడుక్కున్న సేఫ్టీ షూస్ చూపించండి. బాగో లేవంటే ఎందుకు బాగా లేవో చూడాలని ఉంది!"

ఏ ఒక్కరూ ముందుకు రాలేదు.

"మరి? మీ ప్లాంట్ మూలాన యిరవై శాతం ఉత్పత్తి గత రెండు వారాల్లో పడిపోయింది. మిగిలిన ప్లాంట్ల ధర్మమా అంటూ ఉత్పత్తి లక్ష్యాలని సాధించగలిగితే, వార్షికంగా యిచ్చే బోనస్‌లో మీకు కోత కోయవలసి వస్తుంది. ఒకరిద్దరి మీద ఆధారపడి గెలిచే క్రికెట్ కాదిది. వెళ్ళి మీ పనులు చేసుకోండి" – మిశ్రా మీటింగ్ ముగించేశాడు.

కేంటీన్ హాలు ఖాళీ అయింది.

"సంస్థ ఎంతటి లాభాలు చేసుకొంటున్నా దాని సంస్కృతిని తెలిపే అనేకమైన అంశాలలో కేంటీన్లూ, టాయ్‌లెట్లూ కూడా చాలా ముఖ్యమని గ్రహించాలి. అన్ని ప్లాంట్లలోనూ ఉన్న ఈ రెండు సౌకర్యాల విషయమై దృష్టి సారించండి మిస్టర్ దేశాయ్!" అని మిశ్రా డి.జి.ఎమ్. ఎడ్మినిస్ట్రేషన్‌ని లౌక్యంగా మందలించి, కారెక్కాడు.

ప్రస్తుతం కేంటీన్‌ను నడుపుతున్న కంట్రాక్టర్ని యిబ్బంది పెట్టడం కోసం రాజకీయ నాయకుడితో కుమ్మక్కైన దేశాయ్ యిరుకున పడ్డాడు.

ఆరో నెంబరు ప్లాంట్ రెండు రోజుల్లో మళ్ళీ గాడిలో పడింది. అయితే ఎవరూ యూనిఫాం క్లాత్‌ని కాని, సేఫ్టీ షూస్‌ని కానీ వాపసు చెయ్యలేదు. చాలామంది ఆ యూనిఫాం క్లాత్‌తో పిల్లలకి బట్టలు కుట్టించేశారు. లేదా దిండు గలేబులకీ, కిటికీ పరదాలకీ ఉపయోగించారు. దిబ్బల్లా ఉండే సేఫ్టీ షూస్‌ని ఓ వంద రూపాయలు ఖర్చు పెట్టుకొని చక్కటి షూస్‌గా మార్చి కుట్టించుకొన్నారు. అయితే యిటువంటి వాళ్ళందరూ మాట మెత్తనైనా చర్య కఠినంగా తీసుకొనే మిశ్రాకి భయపడి, స్వంత డబ్బులతో సేఫ్టీ షూస్ కొనుక్కొని, యూనిఫాం కుట్టించుకొని సైట్‌కి వెళ్ళాల్సి వచ్చింది.

బాధ్యతల్ని కేంద్రం మీదకు నెట్టకుండా, సమస్యని పరిష్కరించిన మిశ్రా ధైర్యాన్ని మెచ్చుకోలేకుండా ఉండిపోయాడు ఛైర్మన్. లేకపోతే ఏదో కొంతగా జోళ్ళ కుంభకోణం తల ఎత్తేది. మిశ్రా అవలంబించిన కొన్ని విధానాల్ని సంస్థ అమలుపరిచింది.

ప్రస్తుతం ఆ సంస్థలో యింత డబ్బులో మీరే సేఫ్టీ షూస్, యూనిఫాం క్లాత్ కొనుక్కోండి అని డబ్బు యిచ్చేస్తున్నారు. అయితే ఉద్యోగుల్లో చాలామంది ఆ యింతలో కొంత మిగుల్చుకొని నాసిరకం సరుకు కొనుక్కుంటున్నారు. సంస్థని వేలెత్తి చూపడానికి వారికి ఆస్కారం లేదు.

సిబ్బందిని ప్లాంట్లకి తరలించే రవాణాశాఖ, తత్సంబంధమైన ఆటో రిపేరూ వర్క్‌షాపులూ మూతపడి, సిబ్బంది రవాణాని ప్రైవేట్ పార్టీలకి కంట్రాక్ట్‌కి యిచ్చేశారు. ఆఫీసుల, ప్లాంట్ల హౌస్ కీపింగ్ (ఆఫీసుల్ని తుడవడం, టాయ్‌లెట్లు శుభ్రం చెయ్యడం, ఎలక్ట్రికల్ రిపేర్లు, వాటర్ పైప్‌రిపేర్స్, వగైరాలు) కాంట్రాక్టర్ల కిచ్చేశారు.

వీలైన సందర్భాల్లో సాంకేతిక పరమైన కొన్ని పన్లను కూడా బయటివారిచేత చేయిస్తున్నారు. యిద్దర్నో, ముగ్గుర్నో విదేశాలకి పంపి శిక్షణ యిప్పించే బదులు ఒక విదేశీ నిపుణుణ్ణి రప్పించి పదిమందికి శిక్షణ యిప్పిస్తున్నారు. ఉన్నవారి ఉద్యోగాలు ఊడకపోయినా, కొత్త ఉద్యోగావకాశాలు ఈ కాంట్రాక్టర్ల చేతుల్లోకి పోతున్నాయి. యిక్కడ పది గ్రాముల బాధ్యత స్వీకరించడానికి నీలిగే మనుషులు అక్కడ పది కేజీల బాధ్యతని నోరు మెదపకుండా తీసుకొంటారు.

సంస్థల్లో పని కాస్త చురుగ్గా, మెరుగ్గా జరిగిపోతున్నా ప్రతి కాంట్రాక్టూ ఓ తలనొప్పి వ్యవహారం. పరిశ్రమల్లోని సాంకేతిక నిపుణులూ, శాస్త్రజ్ఞులూ సగం కాలానికి పైగా కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్‌లో కొట్టుమిట్టాడుతున్నారు. తాటి చెట్టు కింద కల్లు తాగిన వాడి సంగతి సరేకాని, నీళ్ళు తాగిన వాణ్ణి కూడా అదే కోవలో పరిగణించే సమాజంలో, అన్ని ఒత్తిళ్ళనూ తట్టుకొని, దిట్టమైన మనసుతో నైతికంగా నిలబడ కలిగే వ్యక్తుల అవసరం దేశానికి ఎంతైనా ఉంది.